## క్లుప్తంగా

### గంగాభవానీ మాత తిరునాల ప్రారంభం



పూజలందుకున్న గంగాభవాని మాత

గాండ్లపెంట: మండల కేంద్రంలో శుక్రవారం గంగాభవానీ మాత తిరునాల ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం కలశపూజ, అభిషేకాలతో తిరునాలను ప్రారంభించారు. భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటల నుంచి కత్తివారిపల్లి భజన బృందం రామభజన నిర్వహించారు.శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి చెక్కభజనలు, కొలాటాల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### హమాలీ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో హమాలీలు

నల్లమాడ: జై వీరాంజనేయ హమాలీ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎరికె నరసింహయ్య, ఉపాధ్యక్షుడిగా తలారి చంద్రమోహన్, కార్యదర్శిగా బత్యాల రమేష్, సంయుక్త కార్యదర్శిగా ఎస్. నరసింహులు, కోశాధికారిగా బి. సురేష్, ఈసీ మెంబర్‌గా సాకే చంద్రాయుడును ఎన్నుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

### ఈయూ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కదిరి అర్బన్: పట్టణంలోని ఎన్‌జీఓహోంలో శుక్రవారం ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీని ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణకుమార్, రాజశేఖర్, రాష్ట్ర నాయకులు నబీరసూల్, నాగార్జునరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవైపీ రావ్, శ్రీనివాసులు హాజరయ్యారు. ఎంప్లాయీస్ యూనియన్ కదిరి డిపో కార్యదర్శిగా పని చేస్తున్న శంకరప్పను జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అలాగే కదిరి డిపో అధ్యక్షుడిగా దివాకర్, డిపో కార్యదర్శిగా కొండారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జీసీఎస్ నాయుడు, డిపో వైస్ ప్రెసిడెంట్‌గా జిలాన్‌ఖాన్, ప్రచార కార్యదర్శిగా హరికుమార్, ట్రెజరర్‌గా సుధీంద్ర గ్యారేజీ సెక్రటరీగా రవినాయక్‌తో పాటు మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

### కేబుల్ చోరీ

కనగానపల్లి: మండలంలోని చంద్రాచెర్ల గ్రామ పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద గురువారం రాత్రి దొంగలు పడి ఏడు బోరుబావులకు అమర్చిన కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. స్థానిక రైతులు తెలిపిన వివరాలు.. గ్రామ సమీపంలో వారాదయ్య కొండ కింద రైతులు నాగభూషణ, వెంకటస్వామి, అక్కులప్ప, లక్కావు పూజారి, పోతలయ్య, నాగరాజు, పెదన్న వ్యవసాయ బోరు బావులు ఉన్నాయి. రాత్రి వేళలో రైతులు ఇళ్లకు వచ్చిన సమయంలో దొంగలు పడి ఒక్కో బోరు వద్ద 20 నుంచి 30 మీటర్ల వరకు సుమారు 250 మీటర్ల కేబుల్‌ను కత్తించుకుని వెళ్లారు. చోరీ అయిన కేబుల్ విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని రైతులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

### ఎయిడ్స్‌పై అవగాహన



వీధి నాటకం నిర్వహిస్తున్న కళాజాత బృందం

ధర్మవరం అర్బన్: ఎయిడ్స్‌పై వీధి నాటకంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, వైద్యులు నజీర్, ఐసీటీసీ కౌన్సిలర్ వనమాల తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సరోజమ్మ కళా బృందం వీధి నాటకం ద్వారా ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలను నాటక రూపంలో ప్రజలకు వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్ భార్గవి, శక్తి మైత్రి మహిళా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణమ్మ, ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్‌కుమార్, ఓఆర్ డబ్ల్యూ త్రివేణి, లక్ష్మి, కవిత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధుల కాలం.. పశువులు భద్రం

- దొమ్మరోగం, గాలికుంటు, థైలేరియాసిస్, నెత్తిపిడుగు దాడి
- లక్షణాలు కనిపించగానే చికిత్స తీసుకోవాలంటున్న వైద్యులు



గొర్రెల మంద

గాండ్లపెంట: వర్షాకాల ప్రారంభం పశువులకు వ్యాధుల కాలం మొదలైనట్టే. ఉన్నట్టుండి ఉష్ణోగ్రతలు పడిపోవడం.. తేమ శాతం పెరగడంతో పశువుల్లో వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రధానంగా ఆవులు, గేదేల్లో దొమ్మరోగం, గాలికుంటువ్యాధి, థైలేరియాసిస్ అనే వ్యాధులు, గొర్రెలు, మేకల్లోనూ దొమ్మరోగం, నెత్తి పిడుగు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు, చికిత్సలు తీసుకుంటే పశువులను కాపాడుకోవచ్చని గాండ్లపెంట మండల పశువైద్యాధికారి కేశవనాయక్ తెలిపారు.

**దొమ్మరోగం**

ఈ వ్యాధి పస్తురెల్లామల్టోసిడా అనే బ్యాక్టీరియా వల్ల లేత గడ్డి మేతల ద్వారా పశువులకు వ్యాపిస్తుంది. ఆవులు, గేదెల్లో శరీర ఉష్ణోగ్రత పెరగడం (జ్వరం) మేతమేయకపోవడం, దవడల మధ్య గంగడోలు వాపు లక్షణాల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. సల్ఫామైడ్, పెన్సిలిన్, లివర్ టానిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మందులు వాడడం వల్ల వ్యాధిని నయం చేయవచ్చు. వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే అంటే మార్చి, ఏప్రిల్ నెలల్లోనే టీకాలు వేయించడం వల్ల వ్యాధిని నివారించే అవకాశం ఉంది.

**గాలికుంటు వ్యాధి**

అప్తొవైరస్ అనే సూక్ష్మజీవి, కలుషితమైన గడ్డి, నీరు,పశువులకు ఉపయోగించు తొట్టెల ద్వారా గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. లక్షణాల విషయానికి వస్తే పశువుల్లో జ్వరం 104 నుంచి 106 డిగ్రీల ఫారన్ హీట్ ఉంటుంది. నోట్లో పుండు ఏర్పడడం వల్ల చొంగ కారుస్తూ ఉంటాయి. పాల దిగుబడి పడిపోవడం, గిట్టలలో పుండ్లు రావడం, మేత మేయకపోవడం గమనించవచ్చు.

**థైలేరియాసిస్**

ఈ వ్యాధి ఎక్కువగా సంకరజాతి పశువులలో గమనించవచ్చు. ఈ వ్యాధి థైలేరియా యానులేటా అనే పరాన్నజీవి వల్ల, పిడుదల వల్ల వ్యాపిస్తుంది. శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్‌హీట్ ఉండడం, రక్తహీనత రావడం, ఈనిన పశువుల్లో గర్భస్రావం జరగడం, నీరసంగా ఉండడం వ్యాధి లక్షణాలు. లింపు గ్రంధులు వాపురావడం, శరీర బరువు క్రమంగా తగ్గడం గమనించవచ్చు.

**నెత్తిపిడుగు**

గొర్రెలు, మేకల్లో క్లస్టిడియం అనే బ్యాక్టీరియా వల్ల, లేత గడ్డి మేయడం వల్ల నెత్తి పిడుగు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధిబారిన పడిన జీవాల్లో ఎటువంటి లక్షణాలు బహిర్గతం కాకుండా రెప్ప పాటు కాలంలో మృత్యువాత పడుతుంటాయి. కడుపు ఉబ్బరం, వాయువు లక్షణాలు కనిపించి గొర్రెలు చనిపోతుంటాయి. వ్యాధుల బారిన పడిన వెంటనే సకాలంలో చికిత్స చేయిస్తే పశువులను కాపాడవచ్చని వైద్యాధికారి తెలిపారు.



పశు వైద్యాధికారి కేశవనాయక్

**కదిరి నియోజకవర్గంలో పశువుల వివరాలు**

| పశువులు | గాండ్లపెంట | ఎన్‌పీకుంట | నల్లచెరువు | తనకల్లు | తలుపుల | కదిరి |
|---|---|---|---|---|---|---|
| ఆవులు | 8,412 | 6,250 | 10,100 | 11,200 | 9,282 | 7,848 |
| గేదెలు | 3,150 | 4,050 | 2,100 | 8,057 | 2,279 | 2,115 |
| గొర్రెలు | 82,100 | 87,000 | 96,000 | 97,000 | 74,818 | 1,04,898 |
| మేకలు | 20,100 | 10,100 | 17,100 | 26,000 | 17,100 | 15,853 |

### జగరాజుపల్లిలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పుట్టపర్తి అర్బన్: వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల(తిరుపతి) ఆద్వర్యంలో జాతీయ సేవా పథకం కింద జగరాజుపల్లిలో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువైద్యులు డాక్టర్ పృథ్వీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పశువులకు వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. క్యాల్షియం లోపం, పిడుదులు రాలిపోవడానికి మందులు అందజేశారు. శిబిరంలో 70 పశువులకు వైద్యం అందించినట్లు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ రమణ పేర్కొన్నారు.

### సార్వత్రిక సమ్మె వాయిదా

ధర్మవరం అర్బన్: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న నిర్వహించాల్సిన సార్వత్రిక సమ్మెను వాయిదా వేసినట్లు సీఐటీయూ నాయకులు జేవీ రమణ, ఎస్‌హెచ్ బాషా, అయుబ్‌ఖాన్ తెలిపారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం దేశ పరిస్థితులకు అనుగుణంగా సమ్మె సమంజసం కాదని జాతీయ నాయకులు తెలపడంతో సమ్మె వాయిదా వేశామని, జూలై 9న సమ్మె చేపడతామన్నారు. నాయకులు ఎల్ ఆదినారాయణ, బాబు, బొగ్గు నాగరాజు, అనిల్, నాగవేణి, జయమ్మ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## పునాదికే పరిమితం..



కనగానపల్లిలో ఆగిపోయిన ఆర్‌బీకే భవనం

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతన్నలకు మెరుగైన సేవలు అందించేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్‌బీకే వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఈ రైతు భరోసా కేంద్రాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా భవనాలు కూడా మంజూరు చేశారు. కనగానపల్లి మండలంలో 10 ఆర్‌బీకే భవనాలు మంజూరు కాగా.. వాటిలో చాలా వరకూ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ఆ నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. మండల కేంద్రం కనగానపల్లిలో ఆర్‌బీకే భవనం పునాది దశకే పరిమితమైంది. దీంతో రూ.లక్షల ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రానికి పక్కా భవనం లేక రైతులు, వ్యవసాయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

### ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం



జ్ఞాపికలను చూపుతున్న విద్యార్థులు

రామగిరి: విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 2024–25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎంజేపీ గురుకులాలు, బీసీ వసతి గృహాల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. పేరూరు డ్యాంలో ఉన్న ఏపీఆర్ఎస్ (మహాత్మా జ్యోతిబాపూలే) బాలుర పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు హరినాథ్, మోహన్‌ను బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచి అవార్డులు అందుకున్న విద్యార్థులను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

### బ్రిడ్జి పనులు వేగవంతం చేయండి



ఆర్డీఓకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ధర్మవరం రూరల్: పట్టణంలోని కదిరి రైల్వేగేట్ వద్ద బ్రిడ్జి పనులను వేగవంతంగా జరిగేలా చూడాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన ఆర్డీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు సమస్యలను ఆర్డీఓ మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న ఫైల్స్‌ను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌ఓబీ పనులకు సహకరించిన ఇళ్ల బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నటరాజ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మకు పూజలు



అలంకరణలో ముత్యాలమ్మ

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్ణాటకకు చెందిన భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవతకు పూజలు జరుగుతాయి.

### పట్టపగలే ఇంట్లో చోరీ

కదిరి టౌన్: పట్టణంలోని నల్లగుట్టవీధిలో పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లగుట్టవీధి ఉప్పలపాడు అక్కమ్మ ఇళ్లలో పని చేసుకుని జీవనం సాగించేది. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 5 తులాల బంగారు, రూ.80 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన అక్కమ్మ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

## రోడ్డు పక్కనే మురుగు



ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మురుగు నీరు చేరుతోంది. కాలువలు ఉన్నా శుభ్రం చేయకపోవడంతో మురుగు పొంగి ఇలా వస్తోంది. ఇళ్ల సమీపంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు వ్యాపింపజేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. రహదారి వెంబడి వెళ్లే చిన్నపిల్లలు ఈ మురుగులో పడితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగును తొలగించి ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# డెంగీపై అప్రమత్తత అవసరం



ధర్మవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ మాధవి



కదిరిలో డెంగీ దినోత్సవంపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పుట్టపర్తిలో డెంగీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ధర్మవరం అర్బన్: డెంగీపై అప్రమత్తత అవసరమని స్థానిక ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాంనాయక్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వైద్యులు చెన్నారెడ్డి, శైలజ, సురేష్‌నాయక్, శ్రావణి, ఏఎన్ఎంలు, సీఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్: పట్టణంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనతో డెంగీని నివారించవచ్చని వైద్యులు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ నాగేంద్ర, వైద్యులు విజయలక్ష్మి, వైద్య సిబ్బంది ముస్తఫా, మలేరియో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: డెంగీ రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మునిచంద్రిక, జోత్స్న సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గణేష్ కూడలి వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్ఓ నగేష్, ఎస్‌యూఓ రమణయ్య, సూపర్‌వైజర్ చంద్రకళ, ఆరోగ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నల్లచెరువు: ప్రాణాంతక డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు సుధాకర్, మహబూబ్ బాషా, అక్కాయమ్మ, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమడగూరు: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యాధికారి అపర్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వైద్యాధికారి తెలియజేశారు.

నల్లమాడ: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా రెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లిఖిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సూపర్‌వైజర్ మహబూబ్ బాషా, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురంలో శుక్రవారం డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామ్మోహన్‌చౌదరి డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సర్పంచ్ రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటు మలకవేమల పీహెచ్‌సీ వద్ద శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రాజేంద్ర, రోజా దోమల నివారణ చర్యలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ మంజుల, ఎంపీహెచ్ఏ హరినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు ప్రజలకు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ సరిత, డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ గేట్‌లోని నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ సాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, విష్ణువర్దన్, భాస్కర్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### నాటుసారా తయారీదారు అరెస్ట్

కదిరి అర్బన్: మండలంలోని బాలప్పగారిపల్లితండాలో శుక్రవారం నాటుసారా తయారు చేస్తున్న నిర్మలాబాయ్ అనే మహిళను ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్ అరెస్ట్ చేశారు. నిందితురాలి నుంచి 14 లీటర్ల నాటుసారా, 20 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### నేటి నుంచి వెంకటేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం

పెనుకొండ: పట్టణంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవ వేడుకలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు శుక్రవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 22 వరకూ పూజా కార్యక్రమాలుంటాయన్నారు. 19వ తేదీ బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలన్నారు.

### చిన్నారులను బడుల్లో చేర్పించండి



పాఠశాలలో చేరిన విద్యార్థులతో టీచర్లు

చెన్నేకొత్తపల్లి: ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసూన్‌కుమార్ నాయుడు తల్లిదండ్రులకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం స్పెషల్ టీచర్లు వెంకటలక్ష్మి, నాగేంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాల చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటా తిరిగి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇద్దరు చిన్నారులను పాఠశాలలో చేర్పించుకున్నారు.

### భక్తిశ్రద్ధలతో జలధి



ఈరగార స్వామిని జలధికి తీసుకెళ్తున్న దృశ్యం

అగళి: ఆలూడి గ్రామంలో ఈరగార స్వామి విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా శుక్రవారం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు ఉదయం ఆలయంలో కలశ పూజ, గణపతి హోమం, ఈరగార స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం స్వామి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### ప్రశాంతంగా జీవించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

గాండ్లపెంట: గ్రామంలో గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని డీఎస్పీ శివ నారాయణస్వామి పేర్కొన్నారు. బనాన్‌చెరువుపల్లిలో శుక్రవారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్థానిక రామాలయం వద్ద గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. పోలీసుల సాయం కోసం 100కు డయల్ చేయాలన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తుల సంచారం కాని అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామ సమస్యలు ఎవైనా ఉంటే సంబంధిత అధికారులు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. మహిళల పట్ల సభ్యతగా వ్యవహరించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. బాలికలను బాగా చదివించాలని తెలియజేశారు. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.